
ప్రజాశక్తి
గురువారం 1 మే 2025 | 8 పేజీలు
ఎన్‌టిఆర్ | కృష్ణా






పన్నుల వడ్డన

- పట్టణాల్లో కొత్త పన్నుల వసూళ్లు షురూ
- 15 శాతానికిపైగా ఆస్తి పన్ను పెరుగుదల
- ప్రజలపై రూ.12.67 కోట్ల భారం





2024 ఇంటి పన్ను

2025 ఇంటి పన్ను

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి: మచిలీపట్నం 16వ డివిజన్‌కు చెందిన బి.చైతన్యబాబు, 20వ డివిజన్‌కు చెందిన తోట ఇందిర ఇంటి పన్ను చెల్లించడానికి నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం వచ్చారు. ఆన్‌లైన్లో చెల్లింపుకు తేలిగ్గా ఉంటుందని గత ఏడాది పన్ను చెల్లించిన డిమాండ్లను వెంట తీసుకువచ్చారు. 20/531 డోర్ నంబర్లోని ఇంటికి తోట ఇందిర 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1660 పన్ను చెల్లించారు. 2025-26 కొత్త పన్ను డిమాండ్ ప్రకారం రూ.1910 చెల్లించాల్సి వచ్చింది. ఏడాదికాలంలో 15.06 శాతం రూ.250 ఆస్తి పన్ను పెరిగిందని వాపోయారు. 16/356 డోర్ నంబర్లోని ఇంటికి బి.చైతన్యబాబు గత ఆర్థిక సంవత్సరంలో రూ.2,730 చెల్లించగా, తాజాగా ఆ మొత్తం రూ.3,162కు పెరిగింది. గత ఏడాదికన్నా 14.98 శాతం రూ.412 భారం పడింది. ప్రతి ఏటా ఇంటి పన్ను పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఈ ఇద్దరి సమస్య మాత్రమే కాదు... కృష్ణాజిల్లా వ్యాప్తంగా మచిలీపట్నం నగరపాలక సంస్థతోపాటు తాడిగడప, గుడివాడ, పెడన, ఉయ్యూరు మున్సిపాల్టీల్లోని గృహ, వ్యాపార సముదాయాలపై పన్నులు భారీగా పెరిగాయి. జిల్లాలోని నగరం, పట్టణాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,40,191 ఎస్సెస్‌మెంట్లకు రూ. 39.64 కోట్లు ఉన్న ఆస్తి పన్ను డిమాండ్ తాజాగా రూ.52.31 కోట్లకు పెరిగింది. స్థిరాస్తిదారులపై రూ.12.67 కోట్ల అదనపు భారం పడింది.

పట్టణాల్లో కొత్త పన్నులు వసూలు

వైసిపి అధికారంలో ఉండగా తీసుకు వచ్చిన ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి కూటమి (మిగతా 2లో)

క్షిపణి కేంద్రానికి మోక్షం

- గుల్లలమోదలో రూ.1000 కోట్లతో ఏర్పాటు
- రేపు వర్చువల్‌గా పనులను ప్రారంభించనున్న ప్రధాని

ప్రజాశక్తి-కృష్ణా ప్రతినిధి

కృష్ణాజిల్లా నాగాయలంక మండలం గుల్లలమోదలో క్షిపణి పరీక్షా కేంద్రం పనులను మే రెండో తేదీన ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ప్రధాని మోడీ... క్షిపణి కేంద్రం నిర్మించే ప్రాంతంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

సుదీర్ఘకాలంగా ఎదురు చూపులు

రాష్ట్ర విభజనకు ముందే ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సముద్రతీరంలోని గుల్లలమోద పరిసర ప్రాంతం అత్యంత అనుకూలమైనదిగా కేంద్రం గుర్తించింది. రాష్ట్ర విభజన అనంతరం 289 హెక్టార్ల భూములను గ్రామంలో ప్రభుత్వం సేకరించింది. ఒరిస్సాలోని బాలాకోట్‌కు ధీటుగా ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటవుతుందని ఆశించారు. సుప్రీంకోర్టు క్లియరెన్స్, కేంద్ర అటవీశాఖ అనుమతులు, సిఆర్‌జడ్ రెగ్యులేషన్‌తోపాటు ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్‌ను పూర్తి చేశారు. కేంద్ర రక్షణశాఖ ఆధ్వర్యంలో రూ.1000 కోట్లతో గుల్లలమోద సముద్రతీరంలో క్షిపణి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు 2019 ఆగస్టులో అప్పటి రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ శంకుస్థాపన చేయడానికి జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేసింది. అయితే ఈ కార్యక్రమం రద్దయింది. ఆరేళ్లుగా ప్రాజెక్టు పనులకు సంబంధించి ఎటువంటి పురోగతీ లేదు. ఈ ప్రాజెక్టు గుజరాత్‌కు తరలి వెళ్లిపోతోందనే ఊహాగానాలు వెలువడ్డాయి.

రహదారుల అభివృద్ధిపై ఆశలు

దేశంలో రెండో మిస్సైల్ లాంచింగ్ ప్యాడ్ సెంటర్‌ను గుల్లలమోదలో ఏర్పాటైతే దివిసీమ తీర ప్రాంత అభివృద్ధి కలలు సాకారమవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డ మండలం పులిగడ్డ - గుల్లలమోద వరకు, కోడూరు మండలం ఉల్లిపాలెం-మచిలీపట్నం వంతెన నుంచి గుల్లలమోద వరకు భవిష్యత్‌లో నాలుగు వరుసల రహదారులు ఏర్పాటు చేస్తారనే చర్చ జరుగుతోంది.

2న ప్రారంభోత్సవం

గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రానికి మే 2వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా ప్రారంభించడానికి జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. జిల్లా కలెక్టర్ డికె బాలాజీ, ఎస్పీ (మిగతా 2లో)

పిఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 2న అమరావతి రాజధాని పునః ప్రారంభ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి రానున్న నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకారం, మార్కెటింగ్, పశుసంరక్షణ, డెయిరీ డెవలప్‌మెంట్, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), విజయవాడ తూర్పు ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో మంత్రి సమావేశమై కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకునేందుకు అందుబాటులో ఉన్న మార్గాలు, వివిధ



ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు చేస్తున్న ఏర్పాట్లు, అతిథులకు వసతి, ప్రయాణ ఏర్పాట్లు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఎన్‌టిఆర్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు రానున్నారని, విజయవాడ అర్బన్ పరిధిలోని మూడు నియోజకవర్గాల నుంచి దాదాపు 20 వేల మంది చొప్పున కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఇబ్బంది లేకుండా చేస్తున్న ఏర్పాట్లపై చర్చించారు. అదేవిధంగా తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల నుంచి వచ్చే వివిధ రంగాలకు చెందిన వారికి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని, ఇందుకు ప్రత్యేకంగా నియమించిన లైజనింగ్ అధికారులు దృష్టిపెట్టాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో తాగునీటిని అందుబాటులో ఉంచడంతో పాటు ఎక్కడికక్కడ వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ ద్వారా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నోడల్ అధికారులు, ప్రోటోకాల్ లైజనింగ్ అధికారులు, రూట్ అధికారులు, హోటల్ లైజనింగ్ అధికారులు తదితరులు ప్రణాళిక ప్రకారం విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి: కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజారోగ్య విభాగం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశించారు. బుధవారం నగరంలోని మహాత్మా గాంధీ రోడ్, రామవరప్పాడు రింగ్, నేషనల్ హైవే ప్రాంతాల్లోని పారిశుధ్య నిర్వహణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని అన్నారు. ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రతి రోజు సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారులు, జంక్షన్లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. రోడ్లపై చెత్త వేయడం, అనధికారికంగా వ్యర్థాలు పడేయడం వంటివి నివారించాలని కోరారు. నగర ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

నిర్మల ఫార్మసీలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాముల రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశీయ ఫార్మా సంస్థ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని ఎంపికలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఫార్మసీ కళాశాలల నుండి 150 మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. తొలుత వారికి రాత పరీక్ష నిర్వహించడం జరిగిందని, అనంతరం 128 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులకు వారం రోజుల్లో నియామక పత్రాలు అందిస్తామని హెటిరో కంపెనీ ప్రతినిధి కె.సమీర్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ సిస్టర్ జి.నిర్మల జ్యోతి అభినందించారు.

మొదటిపేజీ తరువాయి

పన్నుల వడ్డన

గంగాధరరావు ఇప్పటికే గుల్లలమోద క్షిపణి పరీక్షా కేంద్రం ప్రాంగణాన్ని పలు పర్యాయాలు సందర్శించారు. కలెక్టర్, ఎస్పి ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. మోడీ వర్చువల్‌గా ప్రారంభించే పైలాన్‌ను ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా గుల్లలమోద గ్రామానికి చెందిన 100 మంది గ్రామస్తులను డిఆర్‌డివో ప్రాంగణంలోకి అనుమతిస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారాన్ని గ్రామస్తులు, ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

క్షిపణి కేంద్రానికి మోక్షం

పార్టీల నాయకులు వ్యతిరేకించారు. ప్రజలకు భారంగా మారుతుందని, ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే పన్నుల బాదుడు షురు చేశారు. 2025 ఫిబ్రవరి ఒకటో తేదీన రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో స్థిరాస్తి విలువలను 10 నుంచి 15 శాతం పెంచారు. దీని ఆధారంగా తాజాగా నగర పాలక సంస్థలు, మున్సిపాల్టీల్లో పన్ను వసూళ్లకు కొత్త డిమాండ్‌ను నాలుగు రోజుల క్రితం ప్రభుత్వం ఆన్‌లైన్లో ఉంచింది. గడువుకు ముందుగా చెల్లించిన వారికి 5 శాతం రాయితీలు ప్రకటించడంతో పట్టణాల్లో గృహాలు, వ్యాపార సముదాయాలున్న వారు పన్ను చెల్లింపులకు ఆసక్తి చూపుతున్నారు. పాతవాటితో పోల్చుకుని చూసి పెరిగిన పన్నులతో ఆందోళన చెందుతున్నారు.

షర్మిల హౌస్ అరెస్టు



ఇంటి వద్ద మాట్లాడుతున్న షర్మిల

ప్రజాశక్తి - గన్నవరం

కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి ఎస్‌విఎల్ గేటెడ్ కమ్యూనిటీలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిలను బుధవారం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో వెళ్తారని ముందస్తు సమాచారం రావడంతో పోలీసులు ఆమెను ఇంటివద్దే అడ్డుకున్నారు. ఇంటి నుండి బయటకు రాకుండా నిర్బంధించారు. ఒకానొక సందర్భంలో మహిళ పోలీసులు ఆమె ఒంటిపై చేయి వేసి నెట్టిన పరిస్థితి వచ్చింది. దీంతో పోలీసుల తీరుపై షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "పోలీసులు నా ఒంటి మీద చెయ్యి వేస్తారా.. ప్రజా సమస్యల మీద ప్రశ్నించే హక్కు నాకు లేదా... దీనికి కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. తనను ఎందుకు హౌస్ అరెస్ట్ చేశారని, ఒక పార్టీ అధ్యక్షురాలిపై ఇటువంటి జులుం ఏంటని, చంద్రబాబు, హోంమంత్రి అనిత దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమరావతి రాష్ట్ర రాజధాని అని, రాజధాని ఎలా ఉందో చూడటం తప్పా అని ప్రశ్నించారు. అమరావతిపై రీసెర్చ్ చేయాలని అనుకుని కాంగ్రెస్ నుండి అమరావతి క్యాపిటల్‌పై ఓ కమిటీ వేశామని, కమిటీ తరుపున అమరావతి వెళ్లి చూద్దామని అనుకున్నామని అన్నారు. ఓ కమిటీ వేస్తేనే ప్రభుత్వానికి ఇంత భయమా అని అన్నారు. అమరావతి రాజధానిలో ఏం దావాలని అనుకుంటున్నారో పాలకులు చెప్పాలన్నారు. ఈ నెల 2న ప్రధాని మోడీ వస్తున్నారని, ఆయనను డిమాండ్ చేయాల్సిన అంశాలు చాలా ఉన్నాయని అన్నారు. వాటిపై మాట్లాడే హక్కు తమకు లేదా అన్నారు. తన ఇంటి ముందు ఇంత సెక్యూరిటీ ఎందుకని, తాను శాంతిభద్రతల సమస్యలను సృష్టించడంలేదని అన్నారు. ఇప్పటికే మహిళలపై అత్యాచారాల్లో రాష్ట్రం దేశంలోనే మూడో స్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొల్లు కష్ణ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ: అగ్ని ప్రమాదాలను నిరోధించడానికి ఆర్ఎస్ బ్రదర్స్ మాల్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్, ఏలూరు రోడ్, వి9 షోరూమ్, లెనిన్ సెంటర్ మరియు చందనా బ్రదర్స్ షో రూమ్‌లన విఎంసి సిబ్బంది ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. అగ్ని ప్రమాదం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన నిరోధక చర్యలు, అగ్ని ప్రమాద నిరోధక పరికరాలను ఉపయోగించు విధానము, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా ఆర్పాలి, ఎటువంటి పరికరాలను ఉపయోగించాలి, ఫైర్ స్ప్రింక్లర్స్, స్మోక్ డిటెక్టర్స్, ఎక్కడెక్కడ అమర్చాలి, వాటి వలన స్మోక్ అలారం ఎలా వస్తుంది, అగ్ని ప్రమాదం జరగకుండా కాంప్లెక్స్ చుట్టూ ఫైర్ సేఫ్టీ మెజర్స్ ఏమేం ఉండాలి వంటి విషయాలపై ఆయా షోరూమ్స్ యాజమాన్యానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎస్ వెంకటేశ్వరరావు, డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ డి.మాల్యాద్రి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎం రాజా పాల్గొన్నారు.

రాజధానికి విఎంసి కార్మికులు

ప్రధాని రాక నేపథ్యంలో పారిశుధ్య పనులకు తరలింపు

ప్రజాశక్తి - విజయవాడ

అసలే కార్మికులు సగానికి సగం మంది తగ్గిపోయి విజయవాడ నగరంలో పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగా ఉన్న పరిస్థితిలో మే 2న ప్రధాని మోడీ అమరావతి పర్యటనకు వస్తున్న నేపథ్యంలో విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన పారిశుధ్య కార్మికులను తరలించారు. రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల నుండి 100 మంది పారిశుధ్య కార్మికులను మున్సిపల్ శాఖ తరుపున రాజధాని ప్రాంతానికి తరలించే పనిలో ఉన్నారు. దీనిలో భాగంగా గత రెండు మూడు రోజుల నుంచి విజయవాడ కార్పొరేషన్ నుంచి వంద మందికి పైగా కార్మికులను రాజధాని ప్రాంతంలో పారిశుధ్య పనులు చేసేందుకు తరలించారు. షిఫ్టుకు 50 మంది చొప్పున ఇక్కడి నుంచి కార్మికులను తరలించేపనిలో ప్రజారోగ్య విభాగం అధికారులు నిమగ్నమయ్యారు. డివిజన్‌కు ఐదుగురు కార్మికుల చొప్పున రెండు షిఫ్ట్‌లకు కలుపుకొని వంద మందికి పైగా కార్మికులను విఎంసి నుంచి తరలించారు. గుంటూరు వైపున ఉన్న ప్రకాశం బ్యారేజీ మొదలు రాజధాని సమీపం వరకు విఎంసి కార్మికులు పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. అయితే తమకు కనీసం మంచినీరు అందుబాటులో ఉండటం లేదని కార్మికులు వాపోతున్నారు. భోజనానికి కూడా సరైన వసతి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది సెప్టెంబర్లో వచ్చిన బుడమేరు వరదల సమయంలో కూడా ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి భారీ సంఖ్యలో కార్మికులను విజయవాడ రప్పించారు. అప్పుడు కూడా కార్మికులు ఆహారం, మంచినీరు, వసతి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సిపిఎం ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రాల్లో భోజనం చేసిన విషయం అందరికీ తెలిసిందే. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో పారిశుధ్యం, ఇతర పనులకు విఎంసి పారిశుధ్య కార్మికులతోపాటు ఇంజినీర్లు, ఇతర విభాగాల అధికారులు సైతం వెళ్లినట్లు తెలిసింది. మరోవైపు విఎంసి కార్మికులను రాజధాని ప్రాంతానికి పంపడంతో విజయవాడ నగరంలో పారిశుధ్యం నిర్వహణ కుంటుపడుతుందని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిన చందాన ప్రధాని రాకతో విఎంసి అధికారులకు, కార్మికులకు విపరీతమైన పని భారం, వత్తిడి పెరిగిపోయాయి.

ప్రధాని పర్యటనకు అంతరాయం కలిగిస్తే చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి -కలక్టరేట్ (కష్ణా) : మే 2వ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో గన్నవరం ఎయిర్పోర్ట్ పరిసర ప్రాంతాల్లో అనధికారికంగా ఎవరైనా డ్రోన్లు ఎగరవేసిన , బ్లాక్ బెలూన్స్, ఇతర రకాలైన బెలూన్స్ ఎగరవేసిన, కార్యక్రమానికి అంత రాయం కలిగించడానికి ప్రయత్నించిన, రహదారులకి అంతరాయం కలిగించిన, ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు చేసిన అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీఆర్. గంగాధరరావు హెచ్చరించారు. ముఖ్యంగా గన్నవరం మండలం, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని సూచించారు .



ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని ప్రదర్శన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అమరావతి పునర్నిర్మాణా ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వస్తు న్నందున ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ కూటమి నాయకుల ఆధ్వర్యంలో పులిగడ్డ చౌరస్తా వద్ద ప్రదర్శన నిర్వహించారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిం చారు. టిడిపి నాయకులు బండి రాఘవ, మండలి శివ, మండలి వెంకట శేషు, రామ్మోహన్రావు పాల్గొన్నారు



చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం, శ్రీ దేవరకొండ నాగన్న వారి అన్నదాన సత్రాల్లో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేసి ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. గుడివాడ డివిజన్ తనిఖీదారు వి. సుధాకర్ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యనిర్వాహ ణాధికారి కెవి గోపాలరావు, వై. శ్రీనివాసరావు, సిబ్బంది కె.వి లక్ష్మి, జి.నాగ మౌనిక, జి. శిరీష పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ (గన్నవరం) : బాపులపాడు మండలం వీరవల్లి సిఎస్ ఐ చర్చి వద్ద నూతనంగా నిర్మించే బీ ఆర్ అంబేద్కర్ విగ్రహం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి రాజ్యాంగ నిర్మాత బి. ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పిల్లా అనితా, గ్రామ అభివద్ధి కమిటీ ఛైర్మన్ గుండపనేని ఉమా వరప్రసాద్, మాజీ సర్పంచులు పిల్లా రామారావు, నందమూరి కష్ణప్రసాద్, ఉప సర్పంచ్ లంక అజయ్ తదితరులు పాల్గొన్నారు .


శంకుస్థాపనలో పాల్గొన్న సర్పంచ్, గ్రామస్తులు


ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : తెలుగుదేశం పార్టీ సంస్థాగత గ్రామ, వార్డు స్థాయి ఎన్నికల్లో భాగంగా మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ నూతన కమిటీ ఎన్నిక బుధవారం మచిలీ పట్నంలో జరిగింది. కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, తెలుగుదేశం పార్టీ మాజీ ఫ్లోర్ లీడర్, క్లస్టర్ ఇంచార్జ్, పల్లపాటి సుబ్రహ్మణ్యంల సమక్షంలో సిడింబి అగ్రహారంలోని రాయపాటి శ్రీరాములు మెమోరియల్ పార్కులో 15 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పి. వి. ఫణి కుమార్ ఆధ్వర్యంలో నూతన డివిజన్ అధ్యక్షుడిగా గంజాల రవికుమార్, ఉపాధ్యక్షులుగా, ఈడే పథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శిగా కొనకళ్ళ భాను ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా తోట శ్యామ్ కుమార్, మడిపల్లి శ్రీను, కార్యదర్శులుగా సయ్యద్ అబ్బాస్, గంజాల కష్ణమూర్తి, పొన్నగంటి వీరాంజనేయులు, కోశాధికారిగా కొనకళ్ళ అరుణ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా కోమటి వెంకటేశ్వరరావు, తోట గోపాల్, శలక విజయ్ కష్ణ, మురాల నాగేశ్వరరావు, మురాల ఈశ్వర్, దేసు శ్రీనివాసరావు లు ఎంపికయ్యారు.

ప్రసాద్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్ఐ జి.వి ప్రసాదరావు పదవీ విరమణ కార్యక్రమం ట్రాఫిక్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐను సిబ్బంది ఘనంగా సత్కరించారు. ట్రాఫిక్ ఏఎస్ఐలు రత్నరాజు, శంకరరావు, భాగ్యవతి, రైటర్ వీరస్వామి, హెడ్ కానిస్టేబుల్ రామచంద్రరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

ప్రతిఒక్కరూ సామాజిక సేవను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - పామర్రు : సమాజంలో ప్రతిఒక్కరూ ఎంతోకొంత సమాజానికి సేవ చేసే దక్పథం కలిగి ఉండాలని ఘంటసాల కళాపీఠం అధ్యక్షులు కాటూరి వెంకట మురళీకష్ణ అన్నారు. బుధవారం ఉండ్రపూడి లోని శ్రీ వీరాంజనేయ దేవాలయం ప్రాంగణంలో దేవాలయ కార్య నిర్వహణ అధికారి పండ్రాజు వెంకట నాగ వర ప్రసాదరావుని కళాపీఠం అధ్యక్షులు కాటూరు వెంకట మురళీకష్ణ సన్మానించారు. అనంతరం దేవాలయానికి విచ్చేసిన భక్తులకు పంచాంగాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ .కార్యదర్శి లంక నరేంద్ర, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.




తగలబడుతున్న గడ్డివామి

విద్యుదాఘాతంతో గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని పోలుకొండ గ్రామం లోని రైతు ఎం.రాఘవరావు చెందిన గడ్డివాము దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు 15 ఎకరాల గడ్డిని కొనుగోలు చేసి పశుగ్రాసం కొరకు వాము వేసుకున్నాడు. విద్యుదాఘాతంతో గడ్డివాముకు మంటలు అంటుకోవడంతో స్థానికులు నీళ్లతో ఆర్పే ప్రయత్నం చేశారు. గుడివాడ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. రైతు రాఘవరావు సుమారు లక్షయాభై వేల రూ.దాకానష్టం వాటిల్లింది.



మట్టిమాఫియాను అరికట్టాలి : బడే గౌతం

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజక వర్గంలోని కోడూరు మండలం లో మట్టి మాఫియా పేట్రేగి పోతుందని వైసీపీ యువనేత బడే గౌతమ్ ఆరోపించారు. బుధ వారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ నియోజకవర్గంలో అంతా ప్రచార ఆర్భాటమే తప్ప చేసేది శూన్యం అన్నారు. ఒకపక్క బెల్ట్ షాపులు నిర్వహిస్తే బెల్ట్ చేస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన మరోప్రక్క నియోజకవర్గంలో మీ ఇంటికే మా మద్యం పథకం అమలు చేస్తూ మద్యాన్ని ఏరులై పారిస్తూ వీధికో బెల్ట్ షాపు నిర్వహిస్తుంటే ఈ ప్రభుత్వం ఎన్నిసార్లు బెల్ట్ తీసిందో ఇక్కడ ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. కోడూరు మండలంలో ప్రకతి వనరులు దోపిడీ గురవుతున్నాయని, అక్రమ మైనింగ్ రూపం లో ప్రభుత్వ భూముల లోని మట్టిని దోచేస్తున్నారని ఎప్పటినుండో సాక్షాత్తు కూటమి పార్టీలోని తెలుగు యువత నాయకుడు ఒకరు బహిరంగంగా ఆరోపణలు చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుందన్నారు.అదేవిధంగా మట్టి మాఫియా మీడియా సోదరులపై జరిపిన దాడిని కూడా తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. మీడియాపై సైతం దాడులకు దిగుతుంటే అన్నీ తెలిసి అవనిగడ్డ ఎమ్మెల్యే మౌనం వహించడం వెనక ఉన్న మర్మమేమిటో అర్థం కావడం లేదని గౌతమ్ విమర్శించారు.

5న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-మొవ్వ : ఉపాధి హామీ కార్మికుల సమస్యల పరిశీలనలో భాగంగా బుధవారం మొవ్వ మండలం పెదముత్తేవి, కొండవరం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం బందం పర్యటించారు. పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు అయిన మంచినీరు, టెంటు, మెడికల్ కిట్టు ఇంతవరకు ఎవరికీ ఇవ్వలేదని, పనులు గత సంవత్సరం వంద రోజులు పని అన్ని గ్రూపులకు రాలేదని కార్మికులు నాయకులకు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కార్మికుల సమస్యలపై ఈ నెల 5 తేదీ జిల్లాలో అన్ని మండల కేంద్రాలలో ధర్నాలు జరుగుతున్నాయని, కావున మే 5 తేదీన మొవ్వ ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయ ప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు కోరారు.



వట్టిపోయిన సాగునీటి చెరువులు



ప్రజాశక్తి - గన్నవరం : మండలంలోని మెట్ట గ్రామా ల్లోని సాగునీటి చెరువులన్నీ ఎడారులుగా మారాయి. పోలవరం నుండి ఇంజన్లతో కొన్ని చెరువులకు నీటిని పెట్టారు. సాగుకు నీటిని తరలించడంతో చెరువులన్నీ ఖాళీ అయ్యా యి. కనీసం పశువులు తాగడానికి నీరు లేని దుస్థితి ఏర్పడింది. కనీసం సాగర్ జలాలతోనైనా చెరువులు నింపుతారని అనుకుంటే ఆపనీ చేయలేదు. పశుపోషకుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. మండ లంలోని మెట్ట గ్రామాల్లో 40 చెరువులున్నాయి. వీటిలో మైనర్ ఇరిగేషన్ చెరువులే అధికం. బ్రహ్మయ్య లింగం చెరువు కూడా ఇందులోనే ఉంది. చెరువుల్లో పూడికలు సంగతి ఎలా ఉన్నా నీటితో చెరువులు నింపాలని రైతులు విన్నవిస్తున్నారు. వేసవి ఎండలు అధికంగా ఉండటంతో ఎండిన చెరువుల్లో కరువు పనులు చేస్తున్నారు. ముస్తా బాదలో రెండు చెరువులు, పురుషోత్తపట్నంలో రెండు చెరువులు, బిబిగూడెం, కొం డపావులూరు, వీరపనేని గూడెం, తెంపల్లి గ్రామాల్లో రెండేసి సాగునీటి చెరువులున్నాయి. ఈచెరువులకు వర్షమే నీటి ఆధారంగా ఉంటుంది. అయితే పోలవరం కాలువ వచ్చిన తర్వాత మోటార్ల తో నీటిని పెట్టి పంటలు పండించారు. వచ్చే సీజన్లో వర్షాలు పడితేనే చెరువులకు నీరొస్తుంది. వర్షం లేకుంటే సాగు సమస్యగా మారుతుందని చెబు తున్నారు. ఈపరిస్థితుల్లో పోలవరం నీటిని చెరువులకు మళ్లిస్తే ముందుగా పశువులు తాగునీటి సమస్యను అదిగమి స్తాయని, అతర్వాత సాగు సమస్య చూసుకోవచ్చని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి చెరువులు నింపడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువులను తక్షణమే నింపాలి
ఆంజనేయులు, సిపిఎం నాయకులు

మెట్ట గ్రామాల్లో చెరువులు నింపడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి. చెరువుల్లో నీరుంటే నే సాగు జరుగుతుంది. గత రెండేళ్లుగా పోలవరం నీటిని మోటార్లతో పెట్టడం వల్ల సమస్య లేకుండా పోయింది. వర్షాలు పడితే పర్వాలేదు కానీ లేకుంటే సాగునీటి ఇబ్బంది వస్తుంది. పోలవరం కాలువ నుండి వీటిని చెరువులకు మళ్లించాలి. పశు వులకు నీరు లేకపోవడంతో అంతా సమస్య వస్తుంది. చెరువులకు నీరు పెట్టడానికి చర్యలు తీసుకోవాలి.

క్రాంతికుమార్‌కు గిన్నిస్ బుక్‌లో చోటు



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన సామంతుల క్రాంతి కుమార్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. డిశంబర్ 1, 2024లో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ విజయవాడ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టీన్ దండింగి ఆధ్వర్యంలో సంగీత వాయిద్య ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 18 దేశాల నుంచి 1,100 మంది సంగీత కళాకారులు పాల్గొని ఆన్‌లైన్‌లో గంటపాటు సరళీ స్వరాలను కీబోర్డుపై ఆలపించి ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేసి ఈ ఘనత సాధించారు. 1,100 మంది పాల్గొనగా 1,046 మంది ఈ రికార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం విజయవాడలో మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో జరిగిన రికార్డు గ్రహీతల సదస్సులో పాస్టర్ దండింగ్ అగస్టిన్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య క్రాంతి కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - మైలవరం : మైలవరం మండలం వెల్వాడం శ్రీమతి లక్కిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987 నుండి 92 వరకు 6 నుండి 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వెల్వాడం మెయిన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వేమిరెడ్డి వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి మేనల్లుడు గుర్రాల వెంకట కోటేశ్వర్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు గూడూరు నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గుర్రాల కోటేశ్వర్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఒక సంఘంగా ఏర్పడి వేసవిలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దావులూరి అప్పారావు, శ్రీనివాసరావు, మురళి, వేముల సూరయ్య, అంబటి కేశవరావు, ఆనం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న మేజిస్ట్రేట్లకు అభినందన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం రాత్రి జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొప్పుల శ్రావణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మైలాబత్తుల శోభారాణి జగ్గయ్యపేట నుండి బదిలీ అయిన సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నేపాగ సుందర్‌రావు అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జూనిర్ సివిల్ జడ్జి శ్రావణి మాట్లాడుతూ తనకు జగ్గయ్యపేట తల్లి లాంటిదని ఇక్కడ పనిచేయటం మొదటిసారి అయినప్పటికీ సీనియర్ న్యాయవాదుల నుండి తాను ఎంతో నేర్చుకున్నానని, ప్రతి ఒక్క సీనియర్ న్యాయవాది నుండి ఒక్కొక్క విషయాన్ని తాను నేర్చుకున్నానని అన్నారు. న్యాయవాదుల సహకారంతో తాను బెంచ్‌ని నడిపించానని తనకు సహకరించిన ప్రతి ఒక్క న్యాయవాదికి కృతజ్ఞతలు తెలిపారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ శోభారాణి మాట్లాడుతూ తాను 33 సంవత్సరాలకు పైగా జ్యుడీషియరీలో పనిచేశానని కానీ ఈ జగ్గయ్యపేటలో పనిచేయటం తనకెంతో అనుభవాన్ని నేర్పిందని అన్నారు. అనంతరం న్యాయవాదులు ఇరువురు జడ్జీలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఇవి.జగన్నాథరావు, కాసరగడ్డ నాగేశ్వరావు, సామినేని వెంకటేశ్వరరావు, పసుపులేటి సత్య శ్రీనివాసరావు, రాయపూడి శ్రీనివాసరావు, వి.మధు, కరణం నరసింహరావు, గోనెల వెంకటేశ్వర్లు, దామాల సంతోష్, అన్నేపాగ కాంతారావు, దాసరి నాగేశ్వరరావు, మార్కపుడి నాగేశ్వరరావు, ఎం.కృష్ణయ్య, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల నిరసన

ప్రజాశక్తి - తిరువూరు : చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు కమ్యూనిటీ హెల్త్ అధికారులు(సీహెచ్ వోలు) తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆందోళన చేశారు. ఏపీ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్లు సీహెచ్ వోలు తెలిపారు. సీహెచ్‌వోలుగా ఆరేళ్లు పూర్తిచేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలని జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా వేతన పెంపుదల అమలుచేయాల ని, పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేశారు. తాము సమ్మెలో ఉన్నా ఎమర్జెన్సీలో సేవల్లో మాత్రం అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వోలు ఎం.అనిత, డి.దీప్తి, జి.ప్రమీల, సిహెచ్.సౌరజా, పి.భానురేఖ, పి. దివ్యమని, ఎ,ప్రియాంక, బి.నాగరత్నం, బి.రోజా, డీ,.దివ్య రాణి, తదితరులు పాల్గొన్నారు.

మైలవరం : మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సిహెచ్‌వోలు మాట్లాడుతూ సిహెచ్ వోలుగా ఆరేళ్లు పూర్తి చేసుకున్న రెగ్యులర్ చేయడం లేదని, జాతీయ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా వేతనాన్ని పెంపుదల చేయాలని, పెండింగ్ లో ఉన్న హెచ్‌డబ్ల్యూ సి అద్దె, కరెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రాల సిహెచ్ ఓలు పాల్గొన్నారు.

వత్సవాయి : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండలంలో పనిచేస్తున్న 18 మంది సిహెచ్‌ఒలు తమ డిమాండ్లను ప్రభుత్వానికి తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని నెలలుగా పెండింగ్లో ఉన్న బకాయిలు వెంటనే అందించాలని ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని ఈ. పి.ఎల్ ను పునరుద్ధరించాలని నిర్దిష్టమైన జాబ్ చార్ట్ ను కల్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి సిహెచ్‌ఓలు ఎస్.దీవెన, టి.లక్ష్మి, తిరుపతమ్మ, జి.సంధ్యారాణి, ఆర్.సృజన, ఎన్.స్నేహ, జి.రత్నకుమారి, కె.మధు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో సిహెచ్‌ఒల నిరసన



మైలవరంలో .....



వత్సవాయిలో....

కృత్రిమ మేథలో మెషిన్ లెర్నింగ్ పాత్ర కీలకం



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ప్రత్యేక ప్రోగ్రామింగ్ లేకుండా అనుభవవాల ద్వారా నేర్చుకునే వ్యవస్థ కారణంగా కృత్రిమ మేథస్సులో మెషిన్ లెర్నింగ్ కీలకమైన భాగంగా మారిందని ఎస్.ఆర్.ఎం యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రావణి ఆనందరావు అన్నారు. కేబిఎన్ కళాశాల పీజీ విభాగం, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో బుధవారం పీజీ విద్యార్థుల కోసం 'మెషిన్ లెర్నింగ్' అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న శ్రావణి మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్‌లో ప్రధానమైన సూపర్వైజ్డ్ లెర్నింగ్ అన్‌సూపర్వైజ్డ్ లెర్నింగ్ రీఫోర్స్‌మెంట్ లెర్నింగ్ గురించి వివరించారు. మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీ వినియోగం డేటా మైనింగ్, ఫైనాన్షియల్ ప్రెడిక్షన్, మెడికల్ డయాగ్నోసిస్, రికమెండేషన్ సిస్టమ్స్, స్పీచ్, ఇమేజ్ రికగ్నిషన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్ వంటి అనేక రంగాల్లో విస్తరించిందన్నారు. సిరి, గూగుల్ అసిస్టెంట్, అలెక్సా వంటి వర్చువల్ అసిస్టెంట్లు, ఈ-కామర్స్ సైట్లలో కనిపించే ఉత్పత్తి సిఫార్సులు, ఆరోగ్యరంగంలో రోగ నిర్ధారణ వంటి వినియోగాలు మెషిన్ లెర్నింగ్ ద్వారా జరుగుతున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో మెషిన్ లెర్నింగ్ విద్య, రవాణా, శక్తి నిర్వహణ మొదలైనవాటిలో విస్తరించే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ నిరంతర సాధన ద్వారా సాంకేతిక పరిజ్ఞానం గురించి ఎక్కువ అవగాహన కలుగుతుందన్నారు. పి.జి. విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, విభాగాధిపతి డాక్టర్ వి.టి.రామ్ పవన్, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి కోనేరు : సంస్మరణ సభలో వక్తలు

విజయవాడ : గ్రామ సర్పంచిగా, కార్పొరేటర్‌గా గుణదల ప్రాంత సమగ్ర అభివృద్ధికి తోడ్పడి పరిపూర్ణ జీవితాన్ని అనుభవించి నేడు 90 ఏళ్ళ వయసులో దూరం అయిన కోనేరు నారాయణరావు ధన్యజీవి అని పలువురు కొనియాడారు. ఇటీవల మరణించిన నారాయణరావు సంస్మరణ సభ స్థానిక ఎపిఐఐసి కాలనీలో ఉన్న స్వర్ణ కళ్యాణ మండపంలో జరిగింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దోనెపూడి శంకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పూర్వ నగర మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ కోనేరు ఛారిటబుల్ ట్రస్ట్ స్థాపించి గోసాలలో వృద్ధుల ఆశ్రమాన్ని స్థాపించి అనేక మందికి ఆశ్రయం కల్పిస్తున్న ఘనత ఆయనదే అని ట్రస్టు ద్వారా అనేక మంది పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థిక సహాయం చేయడం నిరంతరం కొనసాగుతూ ఉందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు మాట్లాడుతూ గుణదల ప్రాంతంలో పై వంతెన శంకుస్థాపన వరకే పరిమితం అయిందని నేటి పాలకులు ప్రజా సంక్షేమం విస్మరించి అభివృద్ధిలో నిర్లక్ష్యం వహిస్తూ ఉన్నారని ప్రథమ మేయర్ టి.వెంకటేశ్వరరావు హయంలో రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధిలో వామపక్ష పార్టీలు కృషి చేశాయని గుర్తు చేశారు. సభలో చారిటబుల్ ట్రస్టు కార్యదర్శి కోనేరు భీమేశ్వరరావు, కోనేరు బడవేశ్వరరావు, ఎన్ జి వో నాయకులు గుళ్లపల్లి నారాయణరావు, సిపిఐ కృష్ణాజిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, వద్దుల సంఘం కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు వెలగపూడి ఆజాద్ కాలని అధ్యక్షులు పాతూరి సాంబశివరావు, కోనేరు రామచంద్రరావు, తెదేపా నాయకులు కాట్రగడ్డ శ్రీనివాస్, సిపిఐ శాఖా కార్యదర్శి కొడాలి ఆనందరావు తదితరులు మాట్లాడుతూ కోనేరు నారాయణరావును స్మరించు కున్నారు.



మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

నెట్టెంకు అభినందనలు


ప్రజాశక్తి - వత్సవాయి : కెడిసిసిబి చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి నెట్టెం రఘురాం పెనుగంచిప్రోలు కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ పారుపల్లి దుర్గాప్రసాద్, మేనేజర్ రంగిశెట్టి రజనీకాంత్, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ నూతలపాటి చెన్నకేశవరావు ముచ్చింతాల, టిడిపి సత్యనారాయణతో పాటు సత్యనారాయణ తో పాటు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



తిరగబడిన టాటా ఎసి వాహనం

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రమాదవశాత్తు టాటా ఏసీ పల్టీ కొట్టడంతో తిరుపతమ్మ దేవస్థానానికి వచ్చిన యాత్రికులకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు పెనుగంచిప్రోలు మునేటి బ్రిడ్జిపై టాటా ఏసీ బోల్తాపడటంతో ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాల య్యాయి. వారిని చల్లపల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. వారిని పెనుగంచిప్రోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



యోగాసన ఛాంప్ శిరీషకు అభినందన

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఏప్రిల్ 25 నుంచి 27 వరకు నిర్వహించిన 2వ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన బి.శిరీషను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. సీనియర్- ఏ విభాగంలో ఆర్టిస్టిక్ పెయిర్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించిన శిరీష గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిశారు. ఎంపి కేశినేని శివనాథ్ యోగాలో బంగారు పతకం సాధించిన శిరీషను శాలువాతో సత్కరించారు. అలాగే శిరీష ఆంధ్రప్రదేశ్ తరుపున పోటీ చేసి ఇండియా యోగాసన టీమ్‌కి వైస్ కెప్టెన్‌గా ఎన్నికైనందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో ఇండియా తరుపున పోటీ పడి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముక్కాకు సత్కారం

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలుకు చెందిన ఉపాధ్యాయుడు ముక్క సత్య నారాయణ హైదరాబాదులో రవీంద్ర భారతిలో సన్మాన కార్యక్రమం నిర్వహిం చారు. మహతి సాహితీ కవి సంగమం వారి ఐదవ వార్షికోత్సవం సందర్భంగా వివిధ ప్రక్రియల్లో 9వేలకు పైగా రచనలు రాసిన ముక్క సత్యనారాయణకు సన్మానించి మహతి కవిబోషణ బిరుదును అందజేశారు కొనకలూరి అయినా జానపద కళల మాజీ చైర్మన్ పొట్లూరి హరికష్ణ సాదా నాల వెంకటస్వామి నాయుడు చేతుల మీదుగా బిరుదును అందుకున్నారు.

డిఎస్‌సిలో జిల్లాకు ఒకే పేపర్ ఉండాలని ధర్నా



రాజీవ్ సెంటర్లో రాస్తారోకో చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ పరీక్షలో ఒక జిల్లాకు ఒకే పేపర్ పెట్టాలని, అభ్యర్థులు చదువుకోవడానికి తగిన సమయం ఇవ్వాలని, రెగ్యులర్ నోటిఫికేషన్ అభ్యర్థులకు వయో పరిమితి 47కు పెంచాలని కోరుతూ అవనిగడ్డలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ నిరుద్యోగులు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న మెగా డీఎస్సీ ఎక్కువమంది నిరుద్యోగులను విస్మరించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీలో ఒక జిల్లాకు ఒకే పేపర్ పెట్టడం వల్ల సమన్యాయం జరుగుతుందని తెలిపారు. నార్మలైజేషన్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర ద్రోహం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గతంలోనే నార్మలైజేషన్లు అవినీతి జరిగిందని తెలిపారు. డీఎస్సీ పరీక్ష నిజాయితీగా నిర్వహించాలని కోరారు. సిలబస్ విస్తృతి రీత్యా డిఎస్సి అభ్యర్థులు చదువుకోటానికి తగిన సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ డీఎస్సీ అభ్యర్థులు శ్రీను అయ్యప్ప చంద్ర జానకిరామ్ రాజు హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు

దేవాలయానికి ఇత్తడి తొడుగులు బహూకరణ

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధిలోని జుజ్జువరం గ్రామంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి 75 వేల రూపాయల విలువ గలిగిన ఇత్తడి తొడుగులను జుజ్జువరం గ్రామానికి చెందిన జున్ను శోభన్ బాబు దంపతులు కానుకగా సమర్పించినట్లు ఆలయ మేనేజర్ పివిఎన్ ప్రసాదరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ సిబ్బంది సన్మానించారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : ఎండల తీవ్రత దష్ట్యా గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ లో బుధవారం మజ్జిగ పంపిణీ జరిగింది. దాతలు మేడవరపు శిరీష, యాదవ సంఘం నేత శ్రీ కూరాకుల దుర్గారావు మనవడు గంప రాజేష్ పాల్గొన్నారు. గన్నవరం గ్రంథాలయ పాఠకులు యారం లీలా రామ్, గోగులముడి రత్నా, బండపల్లి శివరాం, డేరంగుల రాజా, రాచేటి ప్రశాంత్ కుమార్ సేవలు అందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గుడివాడ : శ్రీకష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చలసాని లక్ష్మీ పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని మమత వృద్ధాశ్రమంలోని వద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు జాజుల మునీంద్ర, జాజుల తాతారావు, కంతేటి హరిబాబు, నర్ని వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-గూడూరు : ఆడపిల్లలు దూర ప్రాంతం వెళ్లకుండా గూడూరు మండలం ఆకుమర్రు గ్రామంలో పెడన శాసనసభ్యులు కాగిత కష్ణ ప్రసాద్ ప్రోత్సాహంతో అప్పర్ ప్రైమరీ స్కూలును హై స్కూల్ స్థాయికి పెంచడం ఎంతో అభినందనీయమని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. బుధవారం పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం లంకిశెట్టి బాలాజీ వనజ దంపతులు లక్ష రూపాయలు విరాళాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ మాజీ సర్పంచ్ గోపినాగబాబుకు గ్రామ పెద్దలకు మచిలీపట్నంలో అందజేశారు. తమ పూర్వీకుల గ్రామమైన ఆకుమర్రు గ్రామంలో విద్యకు ప్రాధాన్యమిస్తూ పెడన శాసనసభ్యులు తీసుకున్న నిర్ణయం గ్రామంలో



హర్షం వ్యక్తం అవుతుందని బాలాజీ అన్నారు. ఆకుమర్రు గ్రామ మాజీ విఆర్వో లంకిశెట్టి సాయిబాబు, తాడేపల్లి రమేష్, మల్లంపల్లి వీర వెంకట రామాంజనేయులు బాబు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు 118 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఏజీఅండ్‌ఎస్ఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్సె ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళాలో వివిధ కంపెనీ ల్లో ఉద్యోగాలకు 118మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఉపాధిశిక్షణ అధికారి సీహెచ్ అనీల్ కుమార్ తెలిపారు. జాబ్ మేళాలో ఎంఎస్ఎన్ లేబరేటరీస్, ఎస్-ఎస్ ఇనుస్ట్రుమెంట్స్, ఎంఆర్ఎఫ్ తదితర కంపెనీలు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూ లు నిర్వహించారు. జాబ్ మేళాకు 207మంది హాజరుకాగా అందులో 118మంది ఉద్యో గాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శివనాథ్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి పి. నరేశ్ కుమార్, టి. మధు పాల్గొన్నారు.


పంట వ్యర్థాలను తగలబెట్టొద్దు

ప్రజాశక్తి-గన్నవరం : పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన భూసారానికి పర్యావరణానికి హాని కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి రజిని తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో గన్నవరం మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రంలో వ్యవసాయ శాఖ సిబ్బందికి పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన భూసారానికి పర్యావరణానికి కలుగు హానిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ పంట వ్యర్థాలను తగలబెట్టడం వలన నేలలో పోషకాలు నశిస్తాయన్నారు. భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుందని, నేలలోని ఉపయోగకరమైన, మొక్క ఎదుగుదలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు నశిస్తాయని చెప్పారు. నేల స్వభావం పూర్తిగా నిర్జీవం అయిపోతుందని పేర్కొన్నారు. నేలలో తేమను నిలుపుకునే శక్తి తగ్గడం జరుగుతుందన్నారు. పర్యావరణ కాలుష్యం పెరిగి ఆరోగ్యానికి అందరికీ ముప్పు అనేది వాటిల్లుతుంది అని అన్నారు. గ్రామ పరిధిలో గ్రామ వ్యవసాయ సహాయకులు రైతుల వాట్సాప్ గ్రూప్‌లలో, మీటింగ్స్ ద్వారా, మైకుల నందు పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల జరిగే నష్టాలను చెప్పాలన్నారు.

పాల కేంద్రాల అభివృద్ధికి కృషి : చలసాని



ప్రజాశక్తి-గన్నవరం : పాడి రైతులతో పాటు పాల కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. గన్నవరం మండలం గోపవరపుగూడెంలో ఐదు లక్షల రూపా యలతో కొత్తగా నిర్మించిన పాలకేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే, యూనియన్ జిల్లా డైరెక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవ సాయం తర్వాత పాడి పరిశ్రమ రైతులకు, వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పిస్తుందన్నారు. మేలు జాతి పశువుల పోషణ ద్వారా పాల ఉత్పత్తిని పెంచవచ్చు అన్నారు. పాలు పెరిగితే ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. పాడి రైతులకు కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా ప్రతి ఏడాది లక్షల రూపాయలు బోనస్ అందిస్తున్నామని, ఈ ఒక్క గోపవరపు గూడెం లోనే 8 లక్షల రూపాయలు బోనస్ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పాడి రైతుల కుటుంబాలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ పలగాని కొండలరావు, గోపవరపు గూడెం పాలకేంద్రం అధ్యక్షులు నల్లూరు వెంకట శివప్రసాద్, డైరెక్టర్లు చిట్టినేని కోటేశ్వరరావు, తరిగొప్పల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మా ట్లాడుతున్న ఎంపీడీఓ శేషగిరిరావు

కిశోర వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : సమాజంలో బాల్యవివాహాలు వలన కలిగే అనర్థాలపై గ్రామాలలో విస్తతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై గ్రామాలలో అవగాహన కల్పించాలని, వారిలో జీవన నైపుణ్యా లను మెరుగుపరచే దిశగా తగిన శిక్షణ ఇవ్వాలన్నారు. బాలికల విద్య వారి జీవితానికి ఒక మలుపు అని వ్యక్తి గత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఏపీఎం అమరేశ్వరరావు అన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ బేబీసరోజిని, ఎంఎస్ కేలు, ఏఎన్ఎంలు, వీఓఏలు, అం గన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన బండి రామకృష్ణ



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను బుధవారం మచిలీ పట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో కలిశారు. కష్ణాజిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటి చైర్మన్‌గా నియమించి రైతులకు సేవ చేసే భాగ్యాన్ని కల్పించడం పట్ల కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రామకష్ణ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కొరకు కషి చేయాలని పవన్ కళ్యాణ్ తెలిపారని, రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు చేయూతనిస్తానని అన్నారు.



విరాళాన్ని అందజేస్తున్న దాత రామచంద్రరావు

విరాళం అందజేత

ప్రజాశక్తి - గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానం ముఖమండపం పున:నిర్మాణానికి స్థానికులు పిన్నమనేని రామచంద్రరావు రూ.10,116 లు విరాళాన్ని బుధవారం ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత రామచంద్రరావును దేవస్థానం వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందచేసారు. దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : మే డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా ఐద్వా ఉపాధ్యక్షురాలు బొల్లా వేణుకుమారి అన్నారు. బుధవారం మంటాడ గ్రామంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని మంటాడ, తాడంకి, లంకపల్లి, కష్ణాపురం తదితర గ్రామాల్లో నిర్వహించే మే డే కార్యక్రమాల్లో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.



తల్లిదండ్రుల చెంతకు ముగ్గురు పిల్లలు

ప్రజాశక్తి - తిరువూరు : తప్పి పోయి వచ్చిన పిల్లలను సురక్షితంగా తల్లి తండ్రులకు ఎస్ఐ సత్యనారాయణ బుధవారం అప్పచెప్పారు. రెండు రోజుల క్రితం ఎర్రమాడు గ్రామ పొలాల్లో తప్పిపోయి దిక్కుతోచక తిరుగుతున్న ముగ్గురు పిల్లలు నాంచారమ్మ, వెంకటేశ్వరమ్మ, చెంచయ్యలను గ్రామస్తులు రక్షణ కల్పించి పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఎస్ఐ వారిని పరిపూర్ణ ఆశ్రమంలో ఉంచి తల్లిదండ్రుల వివరాలను సేకరించారు. కావలి దగ్గర కందుకూరు మండలం, రామాయ పట్నానికి చెందిన తల్లితండ్రులు భూమా శ్రీను, లచ్చమ్మ వివరాలు సేకరించి సమాచారం ఇచ్చారు. బుధవారం వచ్చిన తల్లిదండ్రులకు ఎస్ఐ ఎర్రమాడు సర్పంచ్ భర్త బొర్రా మోహనరావు, ఆశ్రమం నిర్వాహకులు సిరికొండ నాగేశ్వరరావుల సమక్షంలో ముగ్గురు పిల్లలను అప్పగించారు. కేవలం 48 గంటల్లో పిల్లలను తల్లితండ్రుల చెంతకు చేర్చిన ఎస్ఐను పలువురు అభినందించారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని విజయవాడ రోడ్డులో గల ప్రజలకు నిరంతరం నగదు లావాదేవీలు అందిస్తున్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత కార్యాలయానికి మార్చారు. నూతనంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ప్రముఖ న్యాయవాది జగన్నాథరావు భవనంలోకి మార్చారు. ఈ నూతన భవనాన్ని బుధవారం జోనల్ హెడ్ కె.ధారాసింగ్ నాయక్ లావాదేవీలను ప్రారంభించారు. అనంతరం బ్యాంకు అధికారులు మాట్లాడుతూ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలో ప్రజల నగదు లావాదేవీలు అందరికీ అందుబాటులో బ్యాంకు సేవలందించడానికి బ్యాంకును సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. జగ్గయ్యపేటలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను ప్రజలందరు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ రిజినల్ హెడ్ పి.సతీష్ బాబు, జగ్గయ్యపేట బ్రాంచ్ హెడ్ బి.శ్రీరాములు, ఆఫీసు సిబ్బంది, పట్టణ ప్రముఖులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

అన్నప్రసాదం పంపిణీ

ప్రజాశక్తి కంచికచర్ల : అక్షయ తృతీయ సందర్భంగా కంచికచర్ల మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి యువసేన ఆధ్వర్యంలో బుధవారం అన్ని ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు దొడ్డ రామ్మోహన్ రావు, దొడ్డ జై నరసింహారావు, వాసవి యువసేన నాయకులు జల్లా శ్రీనివాస్, యశ్వంత్, పామిడి మర్రి పవన్, రాము తదితరులు పాల్గొన్నారు

రావిరాలకు తాగునీటి సరఫరా పునరుద్ధరణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కృష్ణానదికి వచ్చిన వరదల్లో రావిరాల గ్రామం మంచినీటి సరఫరా పూర్తిగా పాడైపోవడం వల్ల గ్రామ ప్రజలు వచ్చి ఎంఎల్ఎకు సమస్యను వివరించగా ఎంఎల్ఎ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈమేరకు కలెక్టర్ డిఎంఎఫ్ (డిస్ట్రిక్ట్ మైనింగ్ ఫండ్) గ్రాంట్ నుండి 7 లక్షల 50 వేల రూపాయలు నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులను పూర్తి చేసి బుధవారం మంచినీటి సరఫరాను ఎమ్మెల్యే రాజగోపాల్ చేతుల మీదుగా మంచినీటి సరఫరాను ప్రారంభించారు.

రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలి : వైసిపి

ప్రజాశక్తి - తిరువూరు : పల్లెర్లమూడి గ్రామంలో రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులతో నియోజక వర్గ ఇన్ ఛార్జి స్వామీదాస్‌తో కలిసి వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడారు. సొసైటీ అధికారులు సంచులు ఇవ్వడం లేదని, ఏమైనా ఇస్తే టిడిపికి చెందిన రైతులకు ఇస్తున్నారని రైతులు అవినాష్‌కు మొరపెట్టుకున్నారు. ఇలా రోడ్డుపై తమ ధాన్యం ఎన్ని రోజులు ఉండాలో అర్థం కావడం లేదని, మరొక పక్క వర్షాలు కురుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మిర్చికి సరైన ధర లేక ఇబ్బందులు పడుతుంటే మరొక పక్క ధర ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం కొనకుండా రైతులను ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తుందని అవినాష్ విమ ర్శించారు. రైతులు రాత్రింపగళ్లు ధాన్యానికి కాపలా ఉంటూ కొనుగోలు చేసే వారికి కోసం ఎదురు చూస్తుంటే ఎన్టీఆర్ జిల్లాలో అధికారులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు మాత్రం ముద్దునిద్ర పోతున్నారు పేర్కొన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి రైతులు ధాన్యాన్ని కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని అవినాష్ డిమాండ్ చేశారు.



రైతులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

విలేకరి గౌస్‌పై అక్రమ కేసు ఎత్తేయాలి

ఎసిపికి జర్నలిస్టు సంఘాల నేతల విజ్ఞప్తి

ప్రజాశక్తి - నందిగామ : ప్రజాశక్తి వీరులపాడు మండల విలేకరి షేక్ లాల్ అహ్మద్ గౌస్‌పై అక్రమంగా కేసు నమోదు చేయటం దుర్మార్గమని పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు అన్నారు. నందిగామ ఎసిపి తిలక్‌ను బుధవారం నందిగామ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్ట్ సంఘాల నాయకులు, పలువురు జర్నలిస్టులు కలిసి జరిగిన సంఘటనను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి విజయవాడ వైపు ఉల్లిపాయలోడు వెళ్తున్న క్రమంలో జుజ్జూరులో ఈనెల 24వ తేదీ రాత్రి కొంతమంది యువకులు డ్రైవర్‌పై విచక్షణ రహితంగా దాడి చేశారని, లారీని కూడా ధ్వంసం చేశారని ఎసిపికి వివరించారు. ఈ ఘటనపై పత్రికలో వార్త ప్రచురితం కావడం సహించలేని కొందరు యువకులు నేరుగా విలేకరి గౌస్‌కు ఫోన్ చేసి చంపేస్తామని బెదిరించారని వివరించారు. అంతేగాక మరుసటి రోజు 25వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో కంచికచర్లలో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై జుజ్జూరు వెళుతున్న గౌస్‌ను ఆ గ్రామానికి చెందిన కొందరు ఆయన ద్విచక్ర వాహనాన్ని అడ్డగించి ఇష్టానుసారంగా దుర్భాషలాడడమే కాకుండా బెదిరించారని తెలిపారు. దీంతో సదరు విలేకరి నందిగామ రూరల్ సిఐ చౌహాన్, వీరులపాడు ఎస్ఐ అనిల్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే ఆ ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా బెదిరించిన యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విలేకరిపై కేసు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఎసిపి తిలక్ స్పందిస్తూ ఈ ఘటనపై అన్ని రకాలుగా విచారించి సదరు విలేకరికి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు ధర్మేంద్ర సింగ్, మీరా హుస్సేన్, ఆకుల వెంకటనారాయణ, రవి శేఖర్, సురేష్, ఐలపోగు రవికుమార్, పత్తిపాటి వాసు, అమర ఉదయభాస్కర్, గోపిశెట్టి వరప్రసాద్, నాగుల్ మీరా, షాన్ భాష, ఖుద్దూ, కేసర వెంకటరత్నం, చంద్, బాబు, ముస్తఫా, మండూరు శ్రీనివాసరావు, అరిగెల శ్రీనివాస రావు, సత్యనారాయణ, సైదాఖాన్‌తోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



ఎసిపి తిలక్‌కు వినతిపత్రం అందజేసి సంఘటన గురించి వివరిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సంగమం ఘాటు వద్ద గుర్తు తెలియని మగ శవం ఉన్నట్లు సమాచారం మేరకు వెళ్లి చూడగా సంగమం ఘాట్లో శవం నీటిపై ఉన్నది. సదరు మృతుడు 5'4 ఎత్తు సన్నగా ఉండి బ్లాక్ కలర్ ప్యాంటు, ధరించి ఉన్నట్లు ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గోవులకు గడ్డి అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు మండలంలోని వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవస్థానంలోని గోవులకు వరిగడ్డిని వితరణగా అందజేశారు. ముండ్లపాడు గ్రామానికి చెందిన రైతు ఆళ్ళ రాజశేఖర్ రెడ్డి 102 వరిగడ్డి కట్టలు 10వేల విలువ చేసే గడ్డిని శాలలోని గోవులకు అందజేశారు. రైతు రాజశేఖర్ రెడ్డిని కార్యనిర్వహణ అధికారి చైర్మన్ అభినందించి అమ్మవారి ప్రసాదాలతో పాటు జ్ఞాపికను అందజేశారు.

కొనసాగుతున్న వేసవి శిబిరాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ శాఖ ఆదేశానుసారం మూడోరోజు బుధవారం ఉదయం 8 గంటలకు విద్యార్థులచే కథలు, పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదివించారు. అనంతరం విజ్ఞాన్ స్కూల్ గణిత ఉపాధ్యాయులు ఎన్.దాసు గణితంలో మెళకువలను నేర్పించారు. ఉపాధ్యాయులు ప్రసాద్ బాబు డ్రాయింగ్‌లోని మెళకువలు నేర్పించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా బొమ్మలు గీశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, గ్రంథాలయ సిబ్బంది ఎ.రమేష్, సత్యవతి రాము పాల్గొన్నారు.

శ్రీశ్రీ రచనలు అజరామరం



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శ్రీశ్రీ విగ్రహానికి నివాళులర్పించి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రచయితలు, సాహితీవేత్తలు

ప్రజాశక్తి -విజయవాడ : సమాజంలో అసమానతలు, దోపిడీ ఉన్నంత వరకు శ్రీ శ్రీ రచనలు, సాహిత్యం అజరామరంగా ఉంటాయని, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పలువురు కొనియాడారు. మహాకవి శ్రీశ్రీ 115వ జయంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం ఆవరణలో ఉన్న శ్రీశ్రీ విగ్రహానికి పలువురు సాహిత్య సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌రే అధ్యక్షులు కొల్లూరి, ప్రోగ్రెసివ్ ఫోరం కార్యదర్శి బి.జమిందారు, జనసాహితీ కార్యదర్శి దివికుమార్, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్, బుక్‌ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య మాట్లాడుతూ అక్రమ నిర్బంధాలు సాగుతున్న ప్రస్తుత తరుణంలో శ్రీశ్రీ వంటి వారి రచనలు స్ఫూర్తి దాయకమన్నారు. అభ్యుదయ విప్లవ సాహిత్యానికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీ సాహిత్య నిధి సంస్థ ప్రచురించిన మందార మాల, జ్వాలా తోరణం, ఘంటసాల గళంలో , శ్రీశ్రీ పద్యపానం, హాస్య వ్యంగ్య గీతాలు, విభిన్న గళాల్లో శ్రీ శ్రీ, మార్గదర్శి శ్రీశ్రీ, నూరేళ్ళ శ్రీ శ్రీ పుస్తకాలను ఆవిష్కరించారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్ కుమార్, ఎపి రచయితల సంఘం కార్యదర్శి చలపాక ప్రకాష్ సాహిత్య సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణ రావు, సింగంపల్లి అశోక్ కుమార్, మొండేపు ప్రసాద్, సర్వజిత్, హజరత్తయ్య గుప్తా, అరసం అరుణకుమార్, ఆంజనేయ రాజు, చింతకాయల చిట్టిబాబు, సాయి కుమార్, కోట వేంకటేశ్వర రెడ్డి, రొమిల్లా తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి జరిగింది. శ్రీశ్రీ చిత్ర పటానికి జెవివి నాయకులు పూలమాల వేసి నివాళుల అర్పించారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ శ్రీశ్రీ గురించి వివరించారు. ఎం.హరికృష్ణ, ఎం.రాం ప్రదీప్, కె.పాపారావు, ఎస్.జగన్మోహన్‌రావు, బి.వెంకటేశ్వర రావు, ఏ.రవి, కె.వెంకట రత్నం పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** కొండపల్లి శాఖ గ్రంథాలయం వేసవి విజ్ఞాన శిబిరంలో మహాకవి శ్రీశ్రీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. జెవివి కొండపల్లి శాఖ కార్యదర్శి ఎస్కే సర్దార్ సాహెబ్ శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి డి.చంద్రశేఖర్, పిఆర్ బాల కృష్ణారావు ఎ.నరసింహరాజు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** పట్టణంలో ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో బుధవారం రసమయి సాహితీ సమితి జగ్గయ్యపేట ఆధ్వర్యంలో మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 115వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ కవి, రచయిత దోసపాటి నాగేశ్వరరావు తదితరులు శ్రీశ్రీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సాహితీ సమితి సభ్యులు నివాస్, వెంకయ్య, ఈశ్వర్, సిలార్, జానీ, బాబ్జి, కోట ప్రభుజీరావు, విల్సన్ బాబు, గ్రంథాలయ సిబ్బంది ఆలేటి ప్రభ, బీడీసీ రమేష్, రాము, శ్యామల పాల్గొన్నారు.



తిరువూరులో...



ఇబ్రహీంపట్నంలో

రేపు ప్రధాని వెలగపూడి రాక

- మోదీ పర్యటనకు తుదిదశకు చేరిన ఏర్పాట్లు
- ఆరు జిల్లాల నుంచి ఐదు లక్షలమంది సమీకరణకు కసరత్తు
- రాజధాని రైతులకు ప్రత్యేక గ్యాలరీ
- ఇంటింటికీ తిరిగి ఆహ్వానిస్తున్న అధికారులు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : అమరావతి పునర్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు శుక్రవారం రాజధానికి రానున్న ప్రధాని సభకు ఐదు లక్షల మంది ప్రజలను సమీకరణకు కసరత్తు జరుగుతోంది. సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నారు. వివిధ జిల్లాల నుంచి ప్రజలు సభకు వచ్చేందుకు వీలుగా 7 వేల బస్సులు, వెయ్యి కార్లు పార్కింగ్‌కు ఏర్పాటు చేస్తున్నారు పలువురు మంత్రులు, సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులతో పాటు గుంటూరు జిల్లా యంత్రాంగం మొత్తం ప్రధాని పర్యటనపై దృష్టి సారించాయి. జిల్లాలోని పలువురు సచివాలయాల ఉద్యోగులకు కూడా ప్రధాని పర్యటన ఏర్పాట్లపై క్షేత్రస్థాయి బాధ్యతలు అప్పగించారు. దీంతో గురు, శుక్రవారాల్లో పంపిణీ చేయాల్సిన పెన్షన్‌లను ఒక రోజు పొడిగించి శనివారం కూడా పంపిణీ చేస్తామని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరక్టర్ విజయలక్ష్మి తెలిపారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మునిసిపల్ మంత్రి నారాయణ బుధవారం వెలగపూడిలో ప్రధాని సభ ఏర్పాట్లపై మీడియాకు తెలిపారు. శాశ్వత హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించేందుకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో భాగంగానే అలాగే ఐఎఎస్, ఐపిఎస్, మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలను కూడా నిర్మించనున్నారు. . రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు అధికారులు ఇళ్లకు వెళ్లి అమరావతి పునర్ నిర్మాణ శంకుస్థాపన సభకు రావాల్సిందిగా ఆహ్వానాలు అందిస్తున్నారు. రాజధాని గ్రామాల్లో ఈసారి శాశ్వత ప్రాతిపదికన రూ.49,040 కోట్లతో చేపట్టనున్న నిర్మాణాలకు ప్రధాని మోడి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే రాష్ట్రంలోని పలు రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారి నిర్మాణాలకు వర్చువల్‌గా ప్రారంభం చేస్తారని అధికారులు తెలిపారు. గుంటూరు -గుంతకల్ రైల్లే ఎలక్ట్రిఫి కేషన్, డబ్లింగ్ పనులు పూర్తయినందున ఈ ప్రాజెక్టును కూడా ప్రధాని వర్చువల్‌గా ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. విజయవాడ-ఖాజీపేటకు మూడో లైను నిర్మాణంకు, డిఆర్‌డివో, డిపిఐపి, నాయ్, రైల్వే ప్రాజెక్టులకు మొత్తం రూ.57,962 కోట్లతో చేపట్టిన, చేపట్టనున్న ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారు. నాగాలాండ్‌లో రూ.1500 కోట్లతో మిస్పైల్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ప్రధాని వేదిక ముందు భాగంలో రాజధాని రైతులకు ఒక ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. ప్రధాని వేదికపై 14 మందికి అవకాశం కల్పించనున్నారు. వీరిలో జిల్లా నుంచి తాడికొండ ఎమ్మెల్యే, గుంటూరు ఎంపి, కేంద్ర మంత్రి పెమ్మసాని, గుంటూరు జిల్లాకు చెందిన మంత్రులు నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ తదితరులకు అవకాశం ఇవ్వనున్నారు.గుంటూరు ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ,మునిసిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ప్రధాని పర్యటనలో నిమగ్నం అయ్యారు. గత వారం రోజులుగా వీరంతా ఈ ఏర్పాట్లలోనే ఉన్నారు. పలువురు రాష్ట్ర ఉన్నతాధికారులు, మంత్రులు ఏర్పాట్లను పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రధాని పర్యటన వేళ వర్ష గుబులు

ప్రజాశక్తి - తుళ్లూరు : ప్రధాని మోడీ రాజధాని అమరావతి పర్యటనకు వర్ష భయం వెంటాడుతోంది. ఆకాశంలో దట్టమైన మేఘాలు ప్రభుత్వానికి, అధికారులకు గుబులు పుట్టిస్తున్నాయి. ఎదురు చూస్తున్న సమయం సమీపిస్తుండడం, పనులు కొలిక్కి వస్తున్నవేళ వర్ష భయం వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఏర్పాట్లను మరోసారి పరిశీలించారు. వర్షం వస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. కాగా బుధవారం రాత్రికి 90 శాతం పైగా ఏర్పాట్లు పూర్తయ్యాయి.



కొనసాగుతున్న శిక్షణా శిబిరాలు


పామర్రులో...

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు ద్వితీయ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. పుస్తక పఠనం వల్ల మేధాశక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారిని టి వాణి అన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రసిద్ధి చెందిన సర్వేపల్లి రాధాకష్ణ ప్రాముఖ్యతను గురించి వివరించారు. పిల్లలకు వారికి నచ్చిన కథలు చదివించడం చేశారు. అనంతరం వాలీబాల్, క్యారమ్స్ ఆటల పోటీలను నిర్వహించారు. **ప్రజాశక్తి-పామర్రు :** మండల పరిధి జమీ గొలువేపల్లి లోని శాఖ గ్రంథాలయ కార్యాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనంపై పోటీ నిర్వహించారు. జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయం అధికారి వి.నాగ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులలో మనోవికాసం, సజనాత్మకతకు చిత్రాలేఖనం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా చిత్ర లేఖనంలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమ తులు అందించారు. ఉపాధ్యాయురాలు ఎన్. మాధవి, పి. పద్మావతి , పి. వెంకట ధర్మారావు పాల్గొన్నారు. అలాగే పామర్రు జిల్లా గ్రంథాలయ శాఖ కార్యాలయంలో జరిగిన వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు మ్యాథమెటిక్స్ లో మెలుకువులు నేర్పించారు. గ్రంథాలయ అధికారి యం. ఝాన్సీ రాణి,రమాదేవి పాల్గొన్నారు.. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** వేసవి శిక్షణ శిభిరంలో పాల్గొని విద్యార్థులు విజ్ఞానం పెంపొందిచుకోవాలని రిసోర్స్ పర్సన్ బి.గోపాలకష్ణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని విద్యార్థులకు చెస్, క్యార మ్స్ ఆటలు నేర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు యోగసనాలు వేశారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడో రోజు విద్యార్థులకు పుస్తక పఠనం, పాటలు, కథలు చెప్పడం కథలు చదవడం నేర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవనిగడ్డ పోస్ట్ ఆఫీస్ పోస్టుమాస్టర్ ఎస్ సుధాకర్, విశ్రాంతి ఉపాధ్యాయులు కరుణశ్రీ, అసిస్టెంట్ పోస్టుమాస్టర్ విశ్వనాథపల్లి నాగేశ్వర రావు పాల్గొని గ్రంథాలయాలలోని పుస్తకాలు చదవడం వల్ల జరిగే ప్రయోజనాలను వివరించారు. గ్రంథాలయం అధికారి ప్రభుదాస్ పర్యవేక్షించారు.



అవనిగడ్డలో...

ప్రధానమంత్రి రాక సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపులు

ప్రజాశక్తి-విజయవాడ : గుంటూరు జిల్లా, వెలగపూడిలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోడి ,ఇతర ప్రముఖుల పర్యటన సందర్భంగా కార్యక్రమమునకు వచ్చే వాహనములకు ట్రాఫిక్‌ను సక్రమంగా క్రమబద్ధీకరించడానికి వీలుగా ఈ నెల 2వ తేదీ ఉదయం 5.00 గంటల నుండి సాయంత్రం 10.00 గంటల వరకు విధముగా ట్రాఫిక్ మళ్లింపులు చేస్తున్నట్లు పోలీసు అధికారులు వివరించారు. వివిఐపి అండ్ విఐపిలు, ప్రముఖ వ్యక్తులు, నాయకులు నోవోటల్ హొటల్ నుండి మహానాడు జంక్షన్, రమేష్ హాస్పిటల్ జంక్షన్, బెంజ్ సర్కిల్ వద్ద కుడివైపుకు తిరిగి ఎంజి రోడ్ మీదుగా పిసిఆర్ జంక్షన్ , పిసిఆర్ ఫ్లైఓవర్, వినాయక టెంపుల్, సీతమ్మవారి పాదాలు అండర్ పాస్, ప్రకాశం బ్యారేజి మీదుగా సభా ప్రాంగణానికి వెళ్లాలన్నారు. అన్ని భారీ వాహనములు, లారీలను రెండువ తేదీ ఉదయం 05:00 గంటల నుండి సాయంత్రం 10.00 గంటల వరకు గుంటూరు నుండి విశాఖపట్నం వైపునకు వెళ్ళు భారి వాహనములు, మధ్యతరహా వాహనములు బుడంపాడు క్రాస్ వద్ద నుండి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, పెనుముడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలన్నారు. .విశాఖపట్నం నుండి చెన్నై వెళ్ళు భారి వాహనములు మధ్యతరహ వాహనములు హనుమాన్ జంక్షన్ వద్దనుండి మళ్ళించి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా వెళ్లాలన్నారు.

చెన్నై నుండి విశాఖపట్నం వెళ్ళు భారి వాహనాలు మధ్యతరా వాహనములు త్రోవగుంట వద్ద మళ్ళించి చీరాల, బాపట్ల, రేపల్లి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్ళవలెను. చెన్నై నుండి హైదరాబాద్ వైపు వెళ్ళు భారి వాహనములు , మధ్యతరా వాహనములు మేదరమెట్ల వద్ద మళ్ళించి అద్దంకి, పిడుగురాళ్ళ, నడికుడి, దామచర్ల మిర్యాలగూడ, నార్కేటపల్లి మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమమునకు వచ్చే వాహనాలు (బస్సులు, కార్లు, ఇతర వాహనములు) ఏలూరు జిల్లా ప్రాంతం నుంచి వచ్చే బస్సులు (350) వారికి ఇచ్చిన జి.పి.యస్ రూటు ప్రకారము రూటు-1 చిన్నఅవుటు పల్లి వద్ద పచ్చిమ బైపాస్ మీదుగా ముస్తాబాద్ వరకు వెళ్ళి. అక్కడ సర్వీస్ రోడ్ లోకి దిగి ఎడమ వైపుకు దిగి నున్న బైపాస్ మీదుగా మన గ్రామం జంక్షన్ వరకు వచ్చి, ఇన్నర్ రింగ్ రోడ్ మీదుగా కంద్రిక జంక్షన్, పైపుల రోడ్ వద్ద కుడివైపుకు తిరిగి వై.వి రావు ఎస్టేట్ పాముల కలువ వద్ద వెస్ట్ బైపాస్ సర్వీస్ మీదుగా నల్లకుంట అండర్ బైపాస్ బ్రిడ్జి, కష్ణానది ఐకానిక్ మీదుగా వెలగపూడి సభా ప్రాంగణానికి మళ్లిస్తామన్నారు.

సింహాచలం మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి


ప్రజాశక్తి-విజయవాడ : సింహాచలం క్షేత్రంలో చోటుచేసుకున్న ఘటన అత్యంత బాధాకరమని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. తిరుమల తొక్కిసలాట ఘటన మరువకముందే అప్పన్న సన్నిధిలో గోడ కూలి ఏడు నిండు ప్రాణాలు బలికావటం కలచివేసిందన్నారు. మతులలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉండటం అత్యంత బాధాకరమన్నారు. కూటమి సర్కారుకి దేవుడంటే భయం, భక్తి ఏమీ లేదని.. కనుకనే ఆలయాలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతి పవిత్రమైన చందనోత్సవం సమయంలో ఇటువంటి అపశతి చోటుచేసుకోవటం కలచివేసిందన్నారు. సింహాచలం దేవస్థానంలో స్వామి వారి నిజరూపదర్శనం కోసం లక్షలాది మంది భక్తులు వసుంటారని.. కానీ భక్తుల భద్రత పట్ల ప్రభుత్వం బాధ్యతారహితంగా వ్యవహరించారని అన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండలం కంచికచర్ల గ్రామంలో వ్యవసాయ మార్కెట్లో బుధవారం ఉదయం జైలారీ డ్రైవర్ తిరుమల తిరుపతి గ్రూప్ వరలక్ష్మి గ్రూప్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదం గురైన అనిల్ కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సేవ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లారీ డ్రైవర్ నాయకులు ప్రసాదు నంద్యాల లారీడ్రైవర్ నాయకులు ఓబులేసు రాజమండ్రి లారీ యూనియన్ నాయకులు మణి నాయుడు సిఐటియు నాయకులులాల్ మొహమ్మద్ గౌస్ తో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లారీ డ్రైవర్లు క్రమశిక్షణగా తమ విధులు నిర్వహించాలని యాజమాన్యానికి మన కుటుంబానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. లారీ డ్రైవర్లకు సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండారుపల్లి మహేష్ బాబు, షేక్ జిలాని, కాశయ్య, పూల.వెంకటేశ్వరరావు జక్కన్న తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా నాయకుడు సీతారామిరెడ్డికి పితృవియోగం



ప్రజాశక్తి - గంపలగూడెం : సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామిరెడ్డి తండ్రి నారాయణరెడ్డి (82) బుధవారం రాత్రి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నారాయణరెడ్డి గత కొంతకాలంగా వయోభారంతో బాధపడుతున్నారు. సిపిఎం అభిమానిగా కొనసాగుతూ, పార్టీ కార్యక్రమాలకు సహకరించేవారు. నారాయణరెడ్డి అంత్యక్రియలు గురువారం ఉయదం 10 గంటలకు కొత్తపల్లిలో జరుగుతాయని కుమారుడు సీతారామిరెడ్డి తెలిపారు.

సిపిఎం జిల్లా, మండల కమిటీల సంతాపం

గువ్వల నారాయణ రెడ్డి మృతికి సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఎం గంపలగూడెం మండల కమిటీ కూడా ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపింది.

కెఎల్‌యు విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ ఉపకులపతి సారధివర్మ, తదితరులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : క్యాంపస్ ప్లేసెమెంట్స్‌లో కెఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు అత్యుత్తమ వార్షిక ప్యాకేజీలతో ప్లేసెమెంట్స్ సాధించారని యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సారధివర్మ తెలిపారు. విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెఎల్ విద్యార్థులు పొందిన క్యాంపస్ ప్లేసెమెంట్స్ వివరాలను తెలిపారు. ఈ ఏడాది 75 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థి ప్లేసెమెంట్ సాధించటం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. 58 లక్షల రూపాయల ప్రీ ప్లేసెమెంట్ ఆఫర్ తో పాటు తమ విద్యార్థులు అనేక రికార్డ్స్ సాధించారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా 6 వేల మందికి పైగా విద్యార్థులు కంపెనీల నుంచి ఆఫర్ లెటర్స్ అందుకున్నారని, 4 వేల 7 వందల మంది విద్యార్థులు వివిధ ప్యాకేజీలలో ప్లేసెమెంట్స్ పొందారని వెల్లడించారు. 20 లక్షల నుంచి 50 లక్షల రూపాయల లోపు వార్షిక ప్యాకేజీలను 35 మందికి పైగా విద్యార్థులు దక్కించుకున్నారని, సూపర్ డ్రీమ్ కంపెనీలలో 150 మంది విద్యార్థులు ప్లేస్ అయ్యారని అన్నారు. భారత దేశ ప్రఖ్యాత సాఫ్ట్ వేర్ కంపెనీ టి సి ఎస్ లో ఒకేరోజు 617 మంది, కాప్ జెమినీ లో 493 మంది, టెక్ మహేంద్రలో 381 మంది విద్యార్థులు మంది ప్యాకేజీలతో ఆఫర్స్ పొందారని చెప్పారు. ఈ ఏడాది జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్, మలేషియా వంటి దేశాల్లో అంతర్జాతీయ ప్లేసెమెంట్స్ దక్కించుకున్నారని తెలిపారు. యూనివర్సిటీ నైపుణ్యాభివద్ధి విభాగం డీన్ డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ 34 నైపుణ్యాభివద్ధి కేంద్రాల ద్వారా 452 మంది అధ్యాపకులు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు, ఎం హెచ్ ఎస్ విభాగం డీన్ డాక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యువనాట్యాచార్యుల సమ్మేళనం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అంతర్జాతీయ నత్య దినోత్సవం సందర్భంగా శ్రీ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నగరంలోని యువనాట్యాచార్యుల సమ్మేళనంతో దాదాపు 250 మంది కూచిపూడి, ఆంధ్ర నాట్య, భరతనాట్య ప్రదర్శనలతో కళా వేదిక ఘల్లు ఘల్లు మంటూ మువ్వల సవ్వడితో అలరారింది. సిద్ధార్థ ఆడిటోరియంలో జరిగిన ఈ నాట్య సమ్మేళనం ప్రముఖ ఆంధ్ర నాట్యాచార్యులు, పిళ్ళా ఉమామహేశ్వర పాత్రుడు నేతృత్వంలో నాట్యాచార్యులు పి. హేమంత్ కుమార్, గోనుగుంట శైలశ్రీ, పద్మశ్రీ హేమంత్, చిముడూరి అజయ్ కుమార్, యల్లా జోశ్యుల అనురాధ, సప్పా శివకుమార్, మాగులూరి త్రినాథాచారి తదితరులు నిర్వహణ చేశారు. వేదికపై నాట్య గురువులకు సత్కారం, చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ద్వారకా జయలక్ష్మి, హవీషా చౌదరి, అనూష నాయుడు, తన్మయి, లేఖ్య భరణి, మేఘన, ప్రణతి, ఆర్ శ్రీనివాసరావు, తేజస్వి, సత్యానందిని



తదితర 21 మంది పలు శాస్త్రీయ నాట్యాంశాలను రమణీయంగా ప్రదర్శించి నటరాజుకు నాట్యనీరాజనాలర్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నాటక రంగ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ముఖ్య అతిథులుగా శారదా రామకృష్ణ, డాక్టర్ ఎం రమేష్, పివి భాస్కరశర్మ, రామిశెట్టి కొండలరావు, డాక్టర్ చింతా రవి బాలకృష్ణ, డాక్టర్ వాండ్రాసి శ్రవణ్ కుమార్, గుజ్జారి అప్పారావు తదితరులు పాల్గొని భారతీయ శాస్త్రీయ నాట్యానికి ఉత్కృష్టమైనదని అన్నారు. కళలు మానసిక ఆనందాన్ని కలిగిస్తాయన్నారు.

హత్య కేసులో పదేళ్ల జైలు

ప్రజాశక్తి - విజయవాడ : నిందితులపై నేరం ఋజువైనందున బుధవారం 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ బి.అబ్రహాం నరహత్య కింద నిందితులకు పది సంవత్సరాల కఠినకారాగార శిక్ష, రూ.2వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. నిండిదితులైన మహబూబ్ నగర్, మాచుపల్లి గ్రామానికి చెందిన దాసరి శివ మస్తాన్ ఏ ఫైటర్ (22), కృష్ణా జిల్లా మంటాడ గ్రామానికి చెందిన అన్నవరపు శివనాగరాజు (25) నేరం రుజువుకావడంతో వారిపై శిక్ష ఖరారయింది. ఈ కేస్‌కు సంబంధించి ఫిర్యాది తన కుటుంబంతో కలిసి భవానిపురం లేబర్ కాలనీలో నివసిస్తున్నట్లు, ఫిర్యాది భర్త ఆటో డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతనికి గుర్రాలు అంటే చాలా మక్కువతో భవానిపురం చర్చ్ సెంటర్ సమీపంలోని గుర్రాల దొడ్డిలో అప్పుడప్పుడు వెళ్ళి వాటికి మేత పెట్టి కాసేపు అక్కడ గడిపి వస్తుంటాడు. అలాగే అతనికి మధ్యం తాగే అలవాటు కూడా ఉంది. ఈ క్రమంలో 2023 జూన్ 4వ తేదీ రాత్రి సమయంలో బయటకు వెళ్ళి వస్తాను అని చెప్పి వెళ్ళినట్లు రాత్రి 12 గంటల సమయంలో అతనికి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. మరుసటి రోజు ఉదయం ఫిర్యాది మేనమామ ఫోన్ చేసి హుస్సేన్ గుర్రాల దొడ్డి దగ్గర గాయాలతో పడి ఉన్నడని చెప్పగా చికిత్స నిమిత్తం జి.జి.హెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ 2023 జూన్ 6న మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో భవానిపురం ఎస్ఐ ప్రసాద్ సెక్షన్ 174 సిఆర్‌పిసిగా కేసుగా దర్యాప్తు చేశారు. ఈ కేసులో 18 మంది సాక్షులను విచారించగా నేరం రుజువైనందున పదేళ్ల శిక్ష, జరిమానా విధించారు.

రెండేళ్ల తర్వాత తల్లి చెంతకు బాలుడు



విజయవాడ : 2023 జులై 3న పెద్దకాలేపల్లి మహిళా సంరక్షక అధికారి (ఎంఎస్‌కె) భానుప్రియ ఈగ.దుర్గ అలియాస్ బుజ్జిబాబు అనే బాబుని రిస్క్యూస్ చేసి బాలల సంక్షేమ కమిటీలో ప్రొడ్యూస్ చేశారు. బాలల సంక్షేమ కమిటీ వారు తాత్కాలిక వసతి కొరకు నవజీవన్ బాల భవన్ ఓపెన్ షెల్టర్‌లో బాబును ఉంచారు. నవజీవన్ బాల భవన్ ఓపెన్ షెల్టర్‌లో నిత్యావసర సదుపాయాలు, వ్యక్తిగత కౌన్సిలింగ్ అందించినపుడు తనది పెద్దకాలేపల్లి అని ఇంకా ఏమి వివరాలు తెలియవని చెప్పాడు. ఆ మేరకు బాలుడిని నవజీవన్ ఫీల్డ్ స్టాఫ్ మమతా పెదకాలేపల్లి తీసుకెళ్లి విచారించగా తల్లిదండ్రుల జాడ తెలియలేదు. దీంతో బాలుడిని చిగురు చిల్డ్రన్ హోమ్‌లో కొన్ని రోజులుంచి బాలల సంక్షేమ కమిటీ ఆర్డర్‌తో దీపనివాస్ చిల్డ్రన్ హోమ్‌కి పంపించారు. దీపనివాస్ చిల్డ్రన్ హోమ్‌లో ఉన్న బాలుడిని పాఠశాలలో చేర్చేందుకు ఆధార్ కోసం మరలా పెదకాలేపల్లి వెళ్లి విచారించగా ఆ ఊరి ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుకున్నట్లు ఆ స్కూల్ ఉపాధ్యాయులు తెలిపారు. అక్కడ ఉపాధ్యాయులు ఇచ్చి ఆధార్ సాయంతో బాలుడిని వేరే స్కూల్లో చేర్పించగా తన తల్లిదండ్రులతో కలిసి ఉంటానని చెప్పి స్కూల్ మానేయడంతో నవజీవన్ బాలభవన్ హోమ్ కౌన్సిలర్ ప్రసన్నకుమార్ బాలుడిని కౌన్సిల్ చేశారు. దీంతో బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్న కుమార్ 'బెస్ట్ ఇంట్రెస్ట్ అఫ్ ది చైల్డ్' ప్రకారం మరోసారి విచారణ చేయాలని సూచించిన మేరకు పెదకాలేపల్లి మాస్టార్ సహాయంతో కాలేపల్లిలో బాలుడి కుటుంబాన్ని గుర్తించామని బాలభవన్ నిర్వాహకులు గుర్తించారు. రెండేళ్ల తర్వాత కుమారుడిని చూసిన తల్లి సంతోషం వ్యక్తం చేసింది. తదుపరి దుర్గను, తల్లిని బాలల సంక్షేమ కమిటీలో ప్రొడ్యూస్ చేశారు. జిల్లా బాలల సంక్షేమ కమిటీ వారి తల్లీకొడుకులతో మాట్లాడిన అనంతరం తల్లికి దుర్గను అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ కె.సువార్త, సిడబ్ల్యుసి మెంబెర్స్, నవజీవన్ బాల భవన్ ఓపెన్ షెల్టర్ ఇన్చార్జి సిహెచ్.ప్రసన్న కుమారి, ఫీల్డ్ స్టాఫ్ ఎఫ్.మమత పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు


ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శ్రీ చైతన్య స్కూల్ ఆధ్వర్యంలో గోశాల శ్రీ చైతన్య స్కూల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి 1500 మందికి పైగా పాల్గొన్నారు. వాలీబాల్ త్రోబాల్, షటిల్ బాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ చైతన్య విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ ఎజిఎం మద్దినేని మురళీ కృష్ణ మాట్లాడుతూ శ్రీ చైతన్య స్కూల్ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాపిటల్ సినిమాస్‌లో విక్టరీ క్లాస్ స్క్రీన్

నేటి నుండి 'హిట్' సినిమాతో బుకింగ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : నగరంలోని ట్రెండ్ సెట్ మాల్‌లో గల క్యాపిటల్ సినిమాస్‌లో 8వ స్క్రీన్ విక్టరీ క్లాస్‌ను బుధవారం సాయంత్రం ఎంఎల్‌ఎ గద్దె రామ మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరంలో వినోదం కోసం క్యాపిటల్ సినిమాస్ మంచి స్క్రీన్స్‌తో సినీ వినోదాన్ని అందిస్తుందని అన్నారు. సినిమా చూసేందుకు చక్కటి సౌకర్యాలతో పాటు లగ్జరీగా ఉండేందుకు స్క్రీన్ 8ను విక్టరీ క్లాస్ పేరుతో ప్రారంభించడం అభినందనీయమన్నారు. అలంకార్ థియేటర్ అధినేత అలంకార ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొదటిసారిగా థియేటర్‌లో అన్ని సీట్లు రిక్లైనర్‌గా ఏర్పాటు చేసింది విజయవాడలోని క్యాపిటల్ సినిమాస్ ఒక్కటే అన్నారు. విక్టరీ క్లాస్‌లో 98 రిక్లైనర్ సీట్లున్నాయని, అతి పెద్ద స్క్రీన్తో సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. మే 1వ తేదీ నుండి హిట్ సినిమాతో థియేటర్ ప్రారంభమవుతుందని అన్నారు. విక్టరీ స్క్రీన్ నుండి క్యాపిటల్ సినిమాస్‌లోని అన్ని రిక్లైనర్స్‌కు కనెక్టివిటీ ఉండేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ మూవీస్ కృష్ణా జిల్లా డిస్ట్రిబ్యూటర్ భగవాన్, క్యాపిటల్ సినిమాస్ జనరల్ మేనేజర్ లోకేష్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ షరాన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కొబ్బరి చిప్ప , ఇటుక రాయిపై చిత్రాలు





ప్రజాశక్తి జగ్గయ్యపేట : పట్టణానికి చెందిన చిత్రకారుడు అల్లి చంద్రశేఖర్ అంతర్జాతీయ శ్రామికుల దినోత్సవం సందర్భంగా శ్రామిక దంపతుల చిత్రాన్ని కొబ్బరి చిప్పలో రెడ్ కలర్ పెన్ తోనూ, ఇటుక రాయిపై పేపర్‌పై శ్రామిక యువతి బుట్టలో బాబుతో ఉన్న చిత్రాన్ని చిత్రీకరించారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ : సింగ్‌నగర్ టిడిపి కార్యాలయంలో 59 డివిజన్‌లో శాశ్వత భూ హక్కు కల్పించిన ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యేత బొండా ఉమామహేశ్వరరావు లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ అజిత్ సింగ్ నగర్, పాయకాపురం, వాంబే కాలనీ, న్యూ రాజరాజేశ్వరి పేట, రాజీవ్ నగర్ తదితర ప్రాంతాలలోని వేలాది మందికి శాశ్వత భూహక్కు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి డైరెక్టర్ ఘంటా కష్ణమోహన్, 59వ డివిజన్ ఇంచార్జ్ జాన్ వలి తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు పంపిణీ చేస్తున్న బొండా ఉమా



మైలవరం శాఖ గ్రంథాలయంలో ఆంగ్లంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆంగ్ల బోధనా పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - మైలవరం : వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు ఆంగ్ల బోధన పద్ధతులపై స్థానిక సెయింట్ మేరీ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు మురళి నాయక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన మాతృభాషతో పాటు ఇంగ్లీష్ కూడా ప్రతి ఒక్కరు అనర్గళంగా మాట్లాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - తిరువూరు : చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం జరుగుతుందని వైసిపి జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆరోపించారు. తిరువూరు మండలం జి.కొత్తూరు సర్పంచ్ శీలం వెంకట్రావమ్మ భర్త కృష్ణారెడ్డి పాము కాటుకు గురై మృతి చెందాడు. అవినాష్ బుధవారం బుధవారం సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. దిగులు పడొద్దని, పార్టీ వారికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు.

కవికాలమ్

కష్టజీవులు...

ఓ ఎర్రెర్రని జెండా
ప్రతీ పేదవానికి నువ్వేగా అండ!
సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుతో
అరుణోదయ పతాకమై
అవనంతా అల్లుకున్నావు!
శ్రమ జీవులను
కళ్లారా గుండెకు హత్తుకున్నావు!

ఎత్తిన పిడికిలికి మండే కాగడవై
తోడుగా నిలిచావు!
శ్రమ దోపిడిపై గళమెత్తావు!
పనిగంటల భారాన్ని తగ్గించి!
శ్రమ సౌందర్యానికి ఎనలేని విలువ కట్టావు!

హక్కుల సాధనకై సాగే!
అనునిత్యం
చెమట చుక్కలతో స్నేహం చేసే!
విప్లవ వీరుల పోరుబాటవు!
అశువులు బాసిన అమరుల
పురిటిగడ్డవు!

మేడేనా చిందిన రక్తం!
శ్రమజీవుల ఆశల స్వప్నం!
ఎర్రజెండా గుండెనపెట్టి
మానవత్వమై సాగును నిత్యం!

- హనుమంతరావు లింగనబోయిన
ఫోన్ : 9010710201